క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

జగదాంబ: స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో గురువారం స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి సూర్యతేజ బీపీ, షుగర్ పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలన్నారు. వ్యాయామం చేస్తూ, ఆహార నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తును ఆరాధిస్తూ ప్రత్యేక ప్రార్థనలు



సందేశమిస్తున్న పాస్టర్ కామినాయుడు

సీతంపేట: గాడ్ మెస్సియా సంఘం వ్యవస్థాపకుడు, పాస్టర్ జి.కామినాయుడు ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్‌లోని సంఘ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక వాక్యం, దైవ సందేశం ఇచ్చారు. పరిసర ప్రాంతాలకు చెందిన క్రీస్తు ఆరాధకులు, సంఘ సభ్యులు ఏసును స్తుతిస్తూ ప్రార్థనలు చేశారు.

అక్రమ నిర్మాణం తొలగించండి

దాబాగార్డెన్స్: అక్రమ నిర్మాణం తొలగించాలని జీవీఎంసీ 55వ వార్డు తాటిచెట్లపాలెం రామాలయం వీధికి చెందిన చిల్లా వెంకటస్వామి జీవీఎంసీ అధికారులను కోరారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగేశ్వరరావు గ్యాస్ కంపెనీ రోడ్డులోని ఒక ఇంటి యజమాని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. 2019 మే నెల 10వ తేదీన జీవీఎంసీ సిబ్బంది వచ్చి తొలగింపు చర్యలు చేపట్టారన్నారు. కొంత భాగం తొలగించిన అనంతరం భవన యజమానులు, బంధువులు టౌన్‌ప్లానింగ్ సిబ్బందిపై దౌర్జన్యం చేసి తొలగింపును అడ్డుకున్నారని తెలిపారు. ఈ విషయం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లినా పోలీసులు ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. దీనిపై జీవీఎంసీ స్పందనలో ఫిర్యాదు చేయగా కోర్టులో కేసు ఉందని చెప్పి తొలగింపు చర్యలు నిలుపుదల చేశారన్నారు. గత మార్చి 11న కోర్టు కేసు కొట్టివేస్తూ డిక్రీ జారీ చేసిందన్నారు. ఈ నెల 2న జీవీఎంసీ స్పందనలో మళ్లీ ఫిర్యాదు చేసినా, అధికారులు స్పందించలేదని ఆరోపించారు.

అచీవర్స్ డే విజయవంతంపై వీసీ హర్షం



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలల జాబ్స్ అచీవర్స్ డే విజయవంతం కావడంపై వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం నిర్వాహకులు, ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు, సిబ్బంది, వలంటీర్లతో వీసీ గురువారం ఏయూ కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో సమావేశమై అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్, ఆచార్యులు, ప్లేస్‌మెంట్ అధికారి సంపూర్ణ కృషితోనే ఈ ఏడాది విద్యార్థులకు అత్యధిక ఉద్యోగాలు సాధ్యమయ్యాయన్నారు. రెక్టార్ ఆచార్య సమత, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శోభాషణరావు, మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె.భట్టీ, పాలక మండలి సభ్యురాలు ఆచార్య శోభశ్రీ, ఆచార్య పాల్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

అంతా వాళ్లిష్టమే..

- యథేచ్ఛగా రోడ్లను ఆక్రమిస్తున్న స్క్రాప్ వ్యాపారులు
- 75 ఫీట్ రోడ్డులో ఎక్కడ పడితే అక్కడే పాత వాహనాలు.. సామగ్రి
- ఇబ్బంది పడుతున్న స్థానికులు, వాహన చోదకులు

నగరాన్ని స్మార్ట్ విశాఖగా తీర్చిదిద్దాలని అధికారులు కృషి చేస్తున్నారు. ఎక్కడికక్కడ అభివృద్ధి చేస్తూ.. సుందరీకరణ చేపడుతూ నగర సోయగాన్ని ఇనుమడింపజేయాలని ప్రయత్నిస్తున్నారు. అయితే అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో కొంత మంది ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ స్థానికులను, వాహన చోదకులను ఇబ్బంది పెడుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డులోని స్క్రాప్ వ్యాపారులు కూడా ఇదే తీరున ప్రవర్తిస్తూ సమస్యాత్మకంగా మారారు.



స్టేడియం ఎదురుగా రహదారిపై అడ్డంగా పెట్టిన స్క్రాప్ వాహనాలు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో స్క్రాప్ వ్యాపారుల తీరు మారలేదు. రహదారులను యథేచ్ఛగా వాడుకుంటూ తమ దుకాణాల్లోని సామగ్రిని ఇష్టారాజ్యంగా దారికి అడ్డంగా పడేయడంతో పాదచారులు, వాహన చోదకులు తిరిగేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారు. వార్డులోని 75 ఫీట్ రోడ్డులో ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ క్రికెట్ స్టేడియం ఒకవైపు.. జీవీఎంసీకి చెందిన జనతాబజార్ మరొక వైపు ఉన్నాయి. ఇటువంటి అన్ని పరిసరాలతో పాటు నలుగురు నడిచే దారిని కూడా స్క్రాప్ వ్యాపారులు తోచిన రీతిలో వాడుకుంటూ స్థానికులను ఇబ్బంది పెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్క్రాప్ వాహనాలను రహదారికి అడ్డంగా పెడుతూ వ్యాపార లావాదేవీలు నిర్వహించుకుంటున్నారు. ఇదేమిటని అడిగేనాథుడే లేకపోవడంతో ఈ ప్రాంతంలో వారిదే హవాగా సాగుతోంది. స్పందించాల్సిన ట్రాఫిక్ పోలీసులు కూడా పట్టించుకోకపోవడంతో స్థానికులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు.

కమిషనర్ ఆదేశాలు బేఖాతర్..

ఇటీవల గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీపై వచ్చిన కమిషనర్ సాయికాంత్‌వర్మ వన్‌టౌన్ అంతా స్వయంగా పర్యటించారు. ఈ సందర్భంగా రహదారిపై అడ్డంగా పెట్టిన స్క్రాప్ వాహనాలు ఆయన దృష్టికి వచ్చాయి. అంతే.. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్పందించిన సిబ్బంది వెంటనే వాహనాలను తొలగించారు. అయితే స్క్రాప్ వ్యాపారులు రోడ్డుకు ఒక వైపు ఉన్న వాహనాలు మరోపక్క పెట్టి.. వేరే చోట ఉన్న వాహనాలను స్టేడియం ఎదురుగా పెట్టి మళ్లీ సమస్య సృష్టించారు. మరోసారి కమిషనర్ పర్యటన జరిగితే తప్ప వాహనాలు పూర్తిగా తియ్యరని పలువురు వాహన చోదకులు చెబుతున్నారు.

తొలగిస్తాం..



కమిషనర్ ఆదేశాల మేరకు వాహనాలను పూర్తిగా తొలగిస్తాం. వాహన చోదకులు ఇబ్బంది పడకుండా రహదారి విశాలంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం.

–కె.శివప్రసాద్, జీవీఎంసీ జోన్–4 కమిషనర్.

● అధినేతకు ఆత్మీయ స్వాగతం





పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు గురువారం నగరానికి విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ పీఎంపాలెం హెలీప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలిసి సాదర స్వాగతం పలికారు.

విజ్ఞాన శిబిరాలతో మేధోసంపత్తి



పిల్లలచే కథలు చదివింపజేస్తున్న గ్రంథాలయ సిబ్బంది



విద్యార్థులకు కథలు వినిపిస్తున్న అతిథులు



యోగా శిక్షణ ఇస్తున్న టీచర్ కృష్ణవేణి

దాబాగార్డెన్స్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరంలో గురువారం పిల్లలకు కథలు చెప్పారు. పుస్తకాలు చదివించారు. రీసోర్స్ పర్సన్ ప్రతిమతో డిబేట్ కాంపిటీషన్ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ సూరరాజు, లైబ్రేరియన్ రాజేంద్రవర్మ, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక పఠనం

అల్లిపురం: బంగారుమెట్ట శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి పిల్లలు కథలు చదివి తోటి విద్యార్థులకు వినిపించారు. విశ్రాంత రైల్వే ఉద్యోగి, గ్రంథాలయ పాఠకుడు ఏవీఎల్ఎన్ రెడ్డి విద్యార్థులకు పుస్తకాల్లోని కథలు చదివి వాటిలో నీతిని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎం.రెడ్డి, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చిత్రలేఖనంలో శిక్షణ

వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు తెలిపారు. విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

విద్యార్థులకు యోగా తరగతులు

పూర్ణామార్కెట్‌లోని రంగిరీజు వీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో గురువారం కథలు చెప్పడం, బుక్ రీడింగ్‌తో పాటు యోగా తరగతులు నిర్వహించారు. యోగా టీచర్ ఎస్.కృష్ణవేణి విద్యార్థులకు యోగా తరగతులు చేపట్టారు. యోగాసనాల వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 45 మంది విద్యార్థులు పాల్గొన్నారని గ్రంథాలయాధికారి టి.పోలితల్లి తెలిపారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన, లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

బీసీ కార్పొరేషన్లకు నిధులివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

అల్లిపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి వెనుకబడిన కులాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు డబ్బీరు కుమారస్వామి కొనియాడారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సమస్యలపై సుదీర్ఘపోరాటం చేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ పదవినిచ్చి గౌరవించారన్నారు. తద్వారా బీసీలు జాతీయ వేదికగా తమ గొంతు వినిపించే అవకాశం కలిగిందన్నారు. కానీ బీసీ కార్పొరేషన్లలో తగినన్ని నిధులు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి వాటికి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా రాష్ట్రంలో ఖాళీగా వున్న ప్రభుత్వ ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వారణాసి అన్నాజీరావు, జిల్లా యువజన అధ్యక్షుడు ఉద్దండరావ్ వెంకటగిరి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

డీఈవో చంద్రకళ

సింహాచలం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తుందని డీఈవో చంద్రకళ అన్నారు. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన జగనన్న విద్యా కానుక కిట్స్ స్టాక్ పాయింట్‌ను గురువారం ఆమె పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత ఎలాంటి ఆటంకం లేకుండా కిట్స్ పంపిణీ చేయాలని సూచించారు. పాఠశాలల వారీగా విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన జేవీ కిట్లు వివరాలతో రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాడు–నేడు ఫీల్డ్ ఇంజినీర్ పి.పద్మ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సునీల్, బి.హరికృష్ణ, కె.రవికుమార్, ఎడ్యుకేషన్ సెక్రటరీ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెయింటింగ్‌లో శిక్షణ

మద్దిలపాలెం: బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్యాబ్రిక్ పెయింటింగ్ వర్క్‌షాప్‌ను శుక్రవారం నుంచి నిర్వహించనున్నామని వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి ఐదు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల శ్రీకృష్ణ మందిరంలో గురువాయూరప్ప ఆవరణలో వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశామన్నారు. వివరాల కోసం 85200 04288 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేణుక యల్లమ్మ ఆలయంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న దాతలు, ఆలయ కమిటీ ప్రతినిధులు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నప్రసాద వితరణ జరిగింది. ప్రముఖ వ్యాపారవేత్త నాగమరి శివ, దేవి దంపతులు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, వాసుపల్లి నారాయణతో పాటు కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. ప్రతి వారం ఒక దాత సహకారంతో ఈ అన్నదానం చేపడుతున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, వైస్ ప్రెసిడెంట్ పంపాన గణేష్, జాయింట్ సెక్రటరీ బడే నాగరాజు, సహ కోశాధికారి సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

శిథిల భవనానికి మోక్షమెప్పుడో?

- కూలేందుకు సిద్ధంగా మత్స్యకారుల కమ్యూనిటీ హాలు
- నిధులున్నా పట్టించుకోని అధికారులు



శిథిలావస్థలో ఉన్న మత్స్యకార భవనం

జగదాంబ: నిధులు మంజూరైనా అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో ఓ భవనం శిథిలమై కూలిపోయే స్థితికి చేరుకుంటోంది. జీవీఎంసీ 39వ వార్డులో మత్స్యకార కమ్యూనిటీ హాలు ఉంది. సుమారు 20 ఏళ్ల కిందట నిర్మాణం చేసిన ఈ భవనం ఏళ్లు గడిచిపోతుండడంతో శిథిల దశకు చేరుకుంది. సిమెంట్ పెచ్చులు ఊడిపోతూ అందవిహీనంగా తయారయింది. ఈ నేపథ్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ భవనం మరమ్మతులకు రూ. 20 లక్షల నిధులు మంజూరు చేశారు. కానీ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ నిధులు మురిగిపోతున్నాయి. ఈ నిధులు ఉపయోగించి భవనాన్ని తీర్చిదిద్దితే పేద మత్స్యకారులు శుభకార్యాలు చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

- ఘనంగా స్వర్ణపుష్పార్చన
- వైభవంగా నిత్యకల్యాణం



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈపూజ నిర్వహించారు. ఆలయ ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

జీవీఎంసీ చలివేంద్రాల్లో మజ్జిగ పంపిణీ



ఊర్వశి జంక్షన్ జీవీఎంసీ చలివేంద్రంలో బాటసారులకు మజ్జిగ అందజేస్తున్న సిబ్బంది



ఆర్ అండ్ బీ బస్‌స్టాప్ వద్ద చలివేంద్రంలో మజ్జిగ పంపిణీని పరిశీలిస్తున్న ఎస్ఈ వేణుగోపాల్

కంచరపాలెం: వేసవి నేపథ్యంలో జీవీఎంసీ జోన్–5 పరిధిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో గురువారం నుంచి తాగునీటితో పాటు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జ్ఞానాపురం, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, రైల్వే న్యూకాలనీ, ఊర్వశి కూడలి, ఐటీఐ కూడలి, 104 ఏరియా, మర్రిపాలెం, ఆర్ అండ్ బీ జంక్షన్, కరాసా, ఎన్ఏడీ, బుచ్చిరాజుపాలెం, గోపాలపట్నం, మల్కాపురం, శ్రీహరిపురం ప్రాంతాల్లోని చలివేంద్రాల్లో బాటసారులకు మజ్జిగ అందించామన్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఏ అండ్ బీ శ్రీనివాస్, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ విభాగం ఈఈలు సుధాకర్, సూరిశెట్టి శేఖర్ మజ్జిగ పంపిణీని పర్యవేక్షించారు.

మజ్జిగ పంపిణీ పరిశీలన

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు జాతీయ రహదారి వద్ద ఆర్ అండ్ బీ బస్‌స్టాప్, జంక్షన్‌లోని చలివేంద్రంలో గురువారం బాటసారులకు మజ్జిగ అందజేశారు. జీవీఎంసీ వాటర్ సప్లై ఎస్ఈ వేణుగోపాల్, ఏఈ శ్రీనివాస్ పలు చలివేంద్రాలను సందర్శించారు. అక్కడ సిబ్బంది సరిగ్గా మజ్జిగ పంపిణీ చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ జీవీఎంసీ ఆధ్వర్యంలో జోన్–5 పరిధిలో జ్ఞానాపురం నుంచి ఆర్ అండ్ బీ వరకు మొత్తం 15 చలివేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల బాటసారులకు మజ్జిగ అందిస్తున్నామని చెప్పారు. ఎండలో ప్రయాణించే వాహన చోదకులు, పాదచారుల దాహార్తిన్ని తీర్చుకునేందుకు వీలుగా ఉండటం వల్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

మనిషి కవి గోపి



కవి గోపికి పురస్కారం ప్రదానం చేస్తున్న హర్షవర్ధన్, రఘురామారావు

సీతంపేట: కవిత్వం అంటే మనిషిని కలిసినట్టు ఉండాలని భావించే మహోన్నత వ్యక్తి, ప్రముఖ కవి, విమర్శకుడు ఎన్.గోపి అని పలువురు వక్తలు కొనియాడారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జగదీశ్వరి ఫౌండేషన్ 2020 సాహిత్య పురస్కారాన్ని ముఖ్య అతిథి రచయిత వి.హర్షవర్ధన్ చేతుల మీదుగా కవి గోపికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ మనిషి కవి గోపి అన్నారు. జగదీశ్వరి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందించి, వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో 2019లో ట్రస్టు స్థాపించినట్లు తెలిపారు. తన భార్య జగదీశ్వరి జ్ఞాపకార్థం ప్రతి ఏటా సాహితీవేత్తలకు జగదీశ్వరి పురస్కారం ప్రదానం చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ రచయితల సంఘం అధ్యక్షుడు అడపా రామకృష్ణ, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.